**ఈ వారం కథ**

# తోడేళ్ళు...

– ఎస్. నూర్‌అహ్మద్

**జగమంతా మత్తుగా నిద్రపోతున్న నిశిరాత్రి వేళలో...**

**వెదురు బొంగులు, ఇనుప తీగలతో గుండ్రంగా కట్టిన దడి మధ్య వున్న గొర్రెలు మౌనముద్రలో వున్న మునుల్లా నిశ్చలంగా కన్పిస్తున్నాయి...**

**మబ్బుల్లేని నిర్మలాకాశంలో మిణుకు మిణుకుమంటున్న నక్షత్రాల వెలుతురు అక్కడ దట్టంగా అల్లుకున్న చీకటి తెరల్ని చీల్చలేకపోతున్నాయి.**

సీమజాతి కంపచెట్ల సందుల నుండి దూసుకొస్తున్న చల్లగాలి సన్నగా సవ్వడి చేస్తోంది.

కొండరాళ్ళ చాటున దాగిన కీచు రాళ్ళు చేస్తున్న రొదలు..

ఉందుండి విన్పిస్తున్న తీతువుపిట్ట అరుపులు... ఆ నిర్మానుష్య ప్రాంతంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఎవరూ ఒంటరిగా ఉండటానికి సాహసించని ఆ ప్రదేశంలో పిశాచరుడిలా ఒక్కడే నిలబడి గొర్రెలకు కాపుకాస్తున్నాడు నారాయణ.

అసలే నల్లటి తారు నలుపు రంగులో కన్పించే అతను తల వెంట్రుకలు కన్పించకుండా తెల్ల తువ్వాలును తలపాగాలాగా గట్టిగా బిగించి కట్టి, కాళ్ళకు బిరుసైన ఆకుచెప్పులు తొడిగి, ఒళ్ళంతా నల్ల కంబళి కప్పకొని, చేతిలో బలమైన వెదురుకర్ర పట్టుకొని దడి చుట్టూ నడుస్తుంటే ఆ చీకట్లో దెయ్యాలకే దడ పుట్టించేలా వున్నాడు.

గొర్రెలున్న దడికి దగ్గరగా చొప్పదంట్లతో వేసిన బొమ్మరిల్లులాంటి చిన్న గుడిసె, దాని పక్కనే నేలపై ముడుచుకుని పడుకున్న పెంపుడు కుక్క, వాటికెదురుగా వెలిగి ఆరిపోయిన చలిమంటల బూడిద కుప్ప, ఆ పక్కనే విసరడానికి సిద్ధంగా ఉంచుకున్న కంకరరాళ్ళు కన్పిస్తుండగా ఆ పరిసరాల



వైపు ఓరగా పరికించి చూస్తూ, ఆ చుట్టుపక్కలున్న ముళ్ళపొదల వైపు నిశితంగా గమనిస్తూ కాపుకాస్తున్నాడు నారాయణ.

ఆ రాత్రి భారంగా గడిచిపోతోంది...

గంటల తరబడి నిలబడి కాపలా కాయడం వల్ల కలిగిన అలసట, దానితోపాటుగా రివ్వున వీస్తూ ముఖాన్ని తాకుతున్న చల్లగాలుల తాకిడికి నిద్ర ముంచుకొస్తున్నట్లు అన్పించడంతో నారాయణ నాలుగు అడుగులు ముందుకు నడిచి, బూడిద కుప్పను కెలికి- అందులో కనిపించిన కొన్ని నిప్పు కణికెలను ఒక చోటికి చేర్చి, వాటిపై ఎండిపోయిన కంప పుల్లల్ని వేసాడు. అవి కాస్తా వెచ్చబడి పొగలు రావడం మొదలయ్యాక నోటితోనే గాలి ఊది మంట రాజేసాక అక్కడే చతికిలపడ్డాడు.

ఆ చల్లని రాత్రిలో చలిమంటల వెచ్చదనాన్ని అనుభవిస్తూ, కంబళి లోపల కప్పబడిపోయిన చొక్కా జేబు నుండి బీడీ తీసి అదే మంటల్లో వెలిగించి నోట్లో పెట్టుకుని ఒప్పకుంటూ ఓ దమ్ము లాగాడు. మళ్ళీ ఓ మారు ఆ పరిసరాలను పరిశీలనగా చూస్తూ, బొడ్లో దోపుకున్న చురకత్తిని తడిమి చూసుకుని... చలిమంటల వెచ్చదనం తగిలిన గొర్రెలు నెమరువేసుకుం

టుంటే, వాటిని చూస్తూ మొన్న జరిగిన సంఘటనను మరోమారు మననం చేసుకున్నాడతను.

* * *

తెల్లటి గోచి పంచె, దానిపై ముడతలు పడిన జుబ్బా, భుజంపైన ఒక పాత తువ్వాలు వేసుకుని, ఉన్న నలుపు రంగుకి తోడుగా పాతకాలం వాటి నల్లకళ్ళద్దాలు పెట్టుకుని నిత్యం సైకిల్‌పై సంచరించే అనంతరావుకి జ్యోతిష్కుడిగా కొండూరులోనే కాకుండా ఆ చుట్టుపక్కలున్న ఐదారు పల్లె ప్రాంతాల్లోనూ మంచి పేరుంది. ముఖ్యమైన పనుల కోసం పట్నాలకు బయల్దేరే ముహూర్తాల నుండి మొదలుకొని, పెళ్ళి ముహూర్తాల దాకా అన్నీ అతనే నిర్ణయిస్తాడు. గ్రామీణుల జీవితాల్లోని బాధలు, వ్యధలు, ఒడిదుడుకులను గురించి బాగా తెలిసిన అతను జ్యోతిష్యానికి తోడు కొంత సమయస్ఫూర్తిని జోడించి చెప్పే జోస్యాలు కొన్ని నిజం కావడంతో అతని మాటంటే అందరికీ గురి కుదిరింది... అలాగని తన దక్షిణ కింద అతను గ్రామీణుల నుంచీ పదులూ, వందలూ లాగడు.

జోస్యం చెప్పినా, ముహూర్తాలు నిర్ణయించినా ఆకు, వక్కలో రెండు రూపాయలు పెట్టి దక్షిణగా అందిస్తే చాలు ఆనందంగా అందుకుంటాడు.

ఒక చేతిసంచిలో గంటల పంచాంగం. తాటాకు పుస్తకం, గవ్వలు లాంటి సరంజామా అంతా పెట్టుకుని దాన్ని తన సైకిల్ హ్యాండిల్‌కు తగిలించుకుని, ముక్కుతూ మూల్గుతూ ముందుకెళ్ళే డొక్కు సైకిల్‌పైనే పల్లెలన్నీ తిరుగుతాడతను.

## మారెమ్మా షీప్ డాగ్స్



మారెమ్మా షీప్ డాగ్స్ ఇటలీలో ప్రసిద్ధి చెందాయి. ఇవి గొర్రెలు మందతో కలసి 24 గంటలూ ఫ్రెండ్లీగా వుంటూ కాపలా కాస్తాయి. 1986 నుంచీ ఈ డాగ్స్‌ని గొర్రెల మందతో కలసి తిరిగేలా, విక్టోరియాలోని ఒక రైతు దంపతులు (ఫ్రాంక్ – రోజ్‌మేరీ) ట్రైనింగ్ యిస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఆ ప్రాంతంలో తోడేళ్ళ బెడద ఎక్కువ. రాత్రికి రాత్రే 20 గొర్రెలు మాయమయిపోయిన సంఘటనలు కూడా వున్నాయి.

ఇయాన్స్ సైమన్స్ అనే ఒక వ్యక్తి టర్కీ కోళ్ళు పెంచుతున్నాడు. ఒక్కోరోజు రాత్రివూట 30 టర్కీ కోళ్ళు ఒకేసారి మాయంకావడం కూడా జరిగింది. అప్పుడు ఆయన ఒక మారెమ్మా పప్‌ని అక్కడ కాపలాకి పెట్టాడు. (పైఫోటోలో) అప్పటి నుంచీ టర్కీ కోళ్ళు మహా ప్రశాంతంగా బ్రతుకుతున్నాయి. వాటి దగ్గరకి వచ్చే సాహసం ఏ శత్రువుకీ లేదు మరి!

– సుంకర భాస్కరరావు

'స్వామి'గా పిల్లా, పెద్దలందరికీ సుపరిచితుడైన అనంతరావు కొందరు అడక్కుండానే జ్యోతిష్యం చెప్పి వారు దక్షిణ కింద ఇవ్వాల్సిన ఒకటి, రెండ్రూపాయలు ఇవ్వకుండా ఓ బీడీ తీసి అందించినా దాన్ని సంతోషంగా తాగి ముందుకు వెళ్తుంటాడు.

నారాయణ విషయంలోనూ నిన్న అదే జరిగింది.

గడ్డి పరకలు కూడా మొలవని కొండూరు బోడికొండల పక్కనున్న చెరువులోని తుమ్మచెట్ల కింద నారాయణ గొర్రెలు మేపుతుంటే అటుగా వచ్చిన 'స్వామి' అతన్ని సైకిల్‌పై నుండే పలుకరించాడు. ఆ తర్వాత ఏదో గుర్తొచ్చినట్లుగా సైకిల్ దిగి, దాన్ని ఓ చోట నిలబెట్టి అక్కడే వున్న ఒక చెట్టు నీడలో తువ్వాలు దులపరించి కూర్చున్నాడు. అతనికి ఎదురుగా నేలపైనే నారాయణ చతికిలపడ్డాడు.

స్వామి ముందుగా అతన్ని కుశల ప్రశ్నలతో పలుకరించిన తర్వాత అతని చెయ్యి పట్టుకుని అరచేతిలోని హస్తరేఖల్ని పరిశీలించి, తాటాకు గ్రంథంలో దబ్బనంతో గుచ్చగా వచ్చిన పేజీని రెండు క్షణాలు నిశితంగా చూసి నిట్టూర్చాడు.

స్వామి ఏం చెబ్తాడా? అని అతని ముఖంలోకి ఆత్రంగా చూస్తున్నాడు నారాయణ.

"నారాయణా, నువ్వింత కాలం దుష్టగ్రహాల పీడతో కష్టాలు పడ్డావు. ఇప్పుడు ఒకటి రెండు రోజుల్లో ఆ గ్రహాలు నిన్ను వీడిపోనున్నాయి కానీ... అవి వెళ్తూ నీకు కొంత నష్టాన్ని కలిగించే అవకాశం వుంది. అది కూడా సరిగ్గా రేపు. మర్నాడు లోపల అవి నీకు నష్టం కలిగించే దాఖలాలున్నాయి" అని చెప్పాడు స్వామి.

అదంతా పూర్తిగా అర్థంకాని నారాయణ "నష్టమంటే... ఎట్లాంటి నష్టం కలుగుతుంది స్వామీ?" అని ప్రశ్నించాడు.

అతని ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ముందు ఒక్క క్షణం పాటు ఆలోచించిన స్వామికి, నిన్నటి దినం పత్రికలలో చూసిన "గొర్రెలపై తోడేళ్ళ దాడులు..." అనే వార్త గుర్తొచ్చింది.

"చూడప్పా, నీకంటూ ఉండే ఆస్తి ఒక్క గుర్రెలే కాబట్టి ఆ గ్రహాలు వాటినే దెబ్బతీయవచ్చు. బహుశా అవి ఏ తోడేళ్ళ రూపంలోనో దాడిచేసి నీ గొర్రెల్ని నీ గొర్రెల్ని లాక్కుపోవచ్చు. అందుకే ఈ రెండ్రోజులూ నువ్వు జాగ్రత్తగా వుండాలి" అని చెప్పాడు స్వామి.

ఆ మాట వినగానే నారాయణ క్షణ కాలం స్తబ్ధంగా ఉండిపోయాడు. ఆ తర్వాత తన బనీను జేబులో ఉన్న మూడు రూపాయిలలో నుండి రెండ్రూపాయిలు తీసి అక్కడి నుండి వెళ్ళిపోతున్న స్వామి చేతిలో పెట్టాడు.

స్వామి వెళ్ళిపోబోతూ మరోసారి, గొర్రెలు... గ్రహాల... విషయమై హెచ్చరించి వెళ్ళాడు.

గొర్రెల్ని మేపుతూ వాటిని అమ్మడమే జీవనాధారంగా పెట్టుకున్న నారాయణకు చిన్నా, పెద్దా కలిసి నలభై దాకా గొర్రెలున్న మంద వుంది. ఆ మందని ఊరికి దూరంగా వున్న తన భూమిలోనే వేసిన దడిలోకే అతను తోలుతుంటాడు. ఆ స్థలం నిర్జనంగా ఉండటంతోపాటుగా కొండలకు దగ్గరగా ఉండటం వల్ల తోడేళ్ళు దాడి చేసేందుకు అవకాశం ఉందన్న విషయం అతనికీ తెలుసు. కానీ మందను పెట్టుకోవడానికి కావాల్సినంత స్థలం అతను నివసించే గుడిసె దగ్గర లేదు. ఇక ఊరి చుట్టూ మల్బరీ తోటలు, వేరుశనగ వేసిన పొలాలు ఉండటంతో తప్పనిసరిగా ఊరికి దూరంగానే మందను పెట్టుకుంటున్నాడతను.

అయితే స్వామి చేసిన హెచ్చరిక మనసులో గుబులు పుట్టిస్తున్నా, గుండెల నిండా నింపుకున్న ఆత్మవిశ్వాసంతో అన్నింటికీ సిద్ధపడి ఎప్పటిలాగానే గొర్రెలను కాస్తున్నాడు. ఆ రోజు రాత్రి గడిచిపోయి, పగలు ఒక పూట గడిస్తే చాలు. స్వామి చెప్పిన గడువు ముగిసిపోతుంది. అందుకే ఆ రాత్రి మరింత జాగ్రత్తగా కాపలా కాస్తూ, కన్పించని గ్రహాలపై ఎదురుదాడికి సిద్ధంగా వున్నాడు నారాయణ...

* * *

గుర్ర్... గుర్ర్... గుర్ర్... గుర్ర్....

ఆగ్రహంతో గుర్రుమంటూ కుక్క చేస్తున్న శబ్దం వినగానే అంతవరకూ ఆలోచనలలో కూరుకుపోతున్న నారాయణ ఒక్కుదుటన లేచి నిలబడి, కుక్క మొరుగుతున్న వైపున ఉన్న సీమజాతి పొదల వైపు నిశితంగా చూసాడు.

ఇంకా వెలుగుతున్న చలిమంటల వెలుతురుకు మెరుస్తున్న కళ్ళతో పొదల్లో పొంచివున్న తోడేళ్ళు కన్పించాయతనికి. పొదలో పొంచిన మూడు, నాలుగు

తోడేళ్ళు గొర్రెల మందపై దాడికి సిద్ధమౌతున్నాయని వాటి కదలికల ద్వారా పసిగట్టిన నారాయణ ఇంక ఆలస్యం చేయకుండా సిద్ధంగా వుంచుకున్న కంకర రాళ్ళలో బలంగా వున్న వాటిని గబగబా ఏరుకుని పొదల్లోకి సూటిగా విసిరాడు.

వేగంగా గాలిని చీల్చుకుంటూ వెళ్ళిన ఆ రాళ్ళ తాకిడికి దెబ్బతిన్న రెండు తోడేళ్ళు తోకలు ముడిచి పొదకు అటువైపుగా పరుగుతీసాయి. సరిగ్గా అదే సమయంలో రాళ్ళ దాడికి భయపడని రెండు తోడేళ్లు మాత్రం గొర్రెల మంద వైపుకు పరుగెత్తుకొని వచ్చాయి.

అందులో ఒక తోడేలు మందను సమీపించే లోపలే అంతవరకూ నిటారుగా నిలబడి మొరుగుతున్న కుక్క దానితో కలబడింది.

ఇంకో తోడేలు గొర్రెలున్న కంచె మధ్యలోకి దూకబోయింది. అయితే అది గాలిలో ఉండగానే నారాయణ కర్రతో బలంగా ఈడ్చికొట్టాడు.

ఊహించని ఆ దాడితో తోడేలు రక్తం కారుతుండగా తోక ముడిచి పొదల వైపు పారిపోయింది.

మరో ప్రక్క ఇంకో తోడేలుతో కలబడి యుద్ధం సాగిస్తున్న నారాయణ పెంపుడు కుక్క, తోడేలు బలం ముందు శక్తిహీనమైపోతున్నా అరుస్తూ పోరాడుతూనే వుంది.

అది చూడగానే నారాయణకు ఆవేశం కమ్ముకురాగా అటువైపుకు పరుగెత్తి వెళ్లి చేతిలోని కర్రతో తోడేలు నడ్డి విరిగేలా బలమైన దెబ్బ వేశాడు. అదే దెబ్బ దాని తలపై పడుంటే అది చచ్చూరుకుండేది. తన శత్రువులు బలపడటం, బలంగా దెబ్బతీయడంతో ఇక చేసేదేం లేనట్లుగా బాధగా మూలుగుతూ వెనుదిరిగి పరుగెత్తడం మొదలుపెట్టింది. నారాయణ కుక్క రెట్టించిన ఉత్సాహంతో దానిని కొంత దూరం తరిమి వెనక్కివచ్చింది.

తోడేళ్ళ అరుపులు, కుక్క మొరుగుళ్ళూ, గొర్రెల అరుపులతో అప్పటిదాకా గందరగోళంగా వున్న ఆ ప్రాంతం కొద్ది క్షణాలకు ఎప్పటిలా నిశ్శబ్దంగా మారింది.

నారాయణ చలిమంటలలో మరిన్ని పుల్లలు వేసి మంట మరింత పెద్దగా రాజేసి ఆ వెలుతుర్లో ముందుగా కుక్కకు తగిలిన గాయాలు పరిశీలించాడు. దాని ఒంటిపై కన్పిస్తున్న తోడేలు పంటిగాట్లు, రక్తపు చారికలు చూసి అతని హృదయం బాధతో మూల్గింది. తనపట్ల అది చూపిన విశ్వాసానికి అభినందిస్తున్నట్లుగా దాని వీపు నిమిరాడతను. ఆ రాత్రి మరే సంఘటనా లేకుండా ప్రశాంతంగా తెల్లారింది.

* * *

బాగా తెల్లారిపోయాక మంద దగ్గర కుక్కను కాపలా పెట్టి ఇక ఇంటి వైపు బయల్దేరుదామని నారాయణ సిద్ధపడుతున్నంతలోనే నలుగురు వ్యక్తులు మంద వైపే రావడం చూసి ఆగిపోయాడు. ఆ వ్యక్తుల్లో ఊరి సర్పంచ్ ఆదినారాయణరెడ్డినీ, చుట్టుపక్కల పల్లెల్లో చిల్లర దొంగగా ముద్రపడ్డ రామప్పనూ గుర్తించాడు. వాళ్ళతోపాటు వచ్చిన ఇద్దరు కొత్త వ్యక్తులెవరో తెలియలేదు.

## హలో బ్రదర్...



వాళ్లిద్దరూ కవల సోదరులు. భలే తమాషా అయినవాళ్ళు! అమ్మాయిలతో ప్రేమాయణాలు జరిపేటప్పుడు చెరిసగం జరిపేవారు! సైన్యంలోనని చేసినప్పుడు, అధికారుల కళ్ళు గప్పి తామిద్దరూ ఒకరిగానే నమ్మించి డ్యూటీలు చేసేవారు! చివరికి జైలుకు కూడా ఒకరి బదులు ఒకరు వెళ్ళేవారు. వాళ్ళ పేర్లు రోనాల్డ్, డోనాల్డ్. ఇద్దరూ కలిసి పోలీసులను, సైన్యాన్నీ, చివరకు తమ భార్యల్ని సహితం మోసగించారు. ప్రేమ కలాపాలు జరిపేటప్పుడు ఒకే స్త్రీని ఇద్దరూ పంచుకొనేవారు– తామిద్దరమూ ఒక్కరమేనని ఆమెను నమ్మించి. రోనాల్డ్‌కు సైన్యంలో ఉద్యోగం వచ్చింది. అయితే అతను ఆ ఉద్యోగానికి డోనాల్డ్‌ను పంపాడు. డోనాల్డ్ భార్యను చావచితక్కొట్టడంతో పోలీసులు అరెస్టు చేసి జైల్లో వుంచారు. నిజానికి జైల్లో వుంది రోనాల్డ్. చాలాకాలం తర్వాత పోలీసులకు ఈ సంగతి తెలిసింది. తమాషాగా వున్న ఈ కవల సోదరుల కథను మన నిర్మాతలెవరైనా తెలుగు మూవీగా తీస్తే బావుణ్ణు!

— కొడిమెల

వాళ్ళంతా దగ్గరికి వచ్చాక ముఖంలో కాఠిన్యం కొట్టొచ్చినట్లుగా కన్పిస్తున్న ఆ కొత్త వ్యక్తులిద్దరూ నారాయణవైపు తీక్షణంగా చూసారు.

సరిగ్గా ఆ సమయంలోనే రామప్ప "నేను గొర్రెలు అమ్మింది ఇతనికే సార్, అదిగో అవే గొర్రెలు..." అని చెబుతూ నారాయణ గొర్రెల మందలోకెల్లా బలంగా వున్న రెండు పొట్టేళ్ళను చూపాడు.

అతను చెప్పిన్నదేమిటో నారాయణకు అర్థమయ్యేలోపలే ఆ కొత్త వ్యక్తుల్లో నల్లగా తుమ్మమొద్దులా కన్పిస్తున్న వ్యక్తి

"ఏరా దొంగ గొర్రెలు కొంటావా. ఎంత ధైర్యంరా నీకు... నీ సంగతేదో చూద్దాం పద: పోలీస్ స్టేషన్‌కు..." అంటూ నారాయణ జబ్బ పట్టుకుని లాగబోయాడు.

అదే సమయంలో మరొక వ్యక్తి రామప్పను గొర్రెల మందలోకి పంపి సిద్ధంగా తెచ్చుకున్న తాడుతో రెండు పొట్టేళ్ళను బయటికి లాగించాడు. ఆ పొట్టేళ్ళతో పాటుగా నారాయణను కూడా వాళ్ళు తీసుకెళ్ళే ప్రయత్నంలో ఉండగా అంతవరకూ చోద్యం చూస్తున్న సర్పంచ్ కల్పించుకుంటూ "సార్! మా నారాయణ అలాంటివాడు కాడు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగి వుంటుంది. నాకో నిమిషం గడువిస్తే నేను వాడితో మాట్లాడుతాను" అని వారి సమాధానానికి ఎదురుచూడకుండా నారాయణను పక్కకు లాక్కెళ్ళాడు.

వచ్చిన వాళ్ళు పోలీసులని, చేయని నేరాన్ని తనపై మోపుతున్నారని అప్పటికి అర్థమయింది నారాయణకు.

అయితే తనకు రామప్పతో పరిచయమే లేదని, తాను దొంగ గొర్రెలు కొనలేదని సర్పంచ్ ఆదినారాయణరెడ్డితో చెప్పకోవాలనుకున్నాడతను.

కానీ అతనికా అవకాశం ఇవ్వకుండా ముందుగా ఆదినారాయణరెడ్డి అతనికి నచ్చజెప్పడం మొదలుపెట్టాడు.

"నారాయణా, నువ్వు దొంగ గొర్రెలను కొనేవాడివి కాదని, నీకంత ధైర్యం కూడా లేదని నాకు తెలుసు. అయితే ఆ రామప్పగాడు తను దొంగిలించిన గొర్రెల్ని నీకే అమ్మానని అంటున్నాడు. ఈ పరిస్థితుల్లో నువ్వు గొర్రెలు కొన్లేదన్నా పోలీసులు వదిలిపెట్టరు. పైగా నువ్వు కాదూ కూడదంటే నువ్వే ఆ గుర్రెల్ని కొన్నావని నిరూపించి నిన్ను కూడా కేసులో ఇరికించేస్తారు. అదే చేస్తే దొంగ వస్తువులు కొనేవాళ్ళ జాబితాలో నీ పేరూ చేరిపోతుంది... అలా చేస్తే నీకు జీవితాంతం ఈ పీడ తప్పదు...

అందుకే నా మాట విని ఆ రెండు గొర్రెల్ని వాళ్ళను తీసుకుపోనీ... మిగతా విషయం నేను మాట్లాడతా..." అని చెప్పాడు రెడ్డి.

అతని మాటల్లోని సత్యం బోధపడిన తర్వాత ఇంకేం మాట్లాడలేదు నారాయణ. ఆ వచ్చిన వాళ్ళు గొర్రెల్ని లాక్కెళ్తుంటే అవి వారి వెంట వెళ్ళడానికి మొరాయిస్తూ భయంతో అరుస్తున్నాయి. అది చూసి మనసు చివుక్కుమంటుంటే...

'అర్ధరాత్రి వచ్చిన నాలుక్కాళ్ళ తోడేళ్ళనైతే ఎదిరించగలను గాని, పట్టపగలే వచ్చే ఈ రెండు కాళ్ళ తోడేళ్ళను ఎవరైనా ఏం చేయగలరు' అనుకుంటూ కళ్ళ నుంచీ జారడానికి సిద్ధమైన కన్నీళ్ళను కనురెప్పల కిందే బిగించిపట్టాడు నారాయణ.